వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి బదిలీ



హస్తినాపురం: ఎల్బీనగర్ జోన్ పరిధిలోని వనస్థలిపురం పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న దేప జలేంధర్‌రెడ్డి మల్టీ జోన్-2కు బదిలీ అయ్యారు. బుధవారం హైదరాబాద్ మల్టీ జోన్-2 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఇచ్చిన బదిలీ ఉత్తర్వుల మేరకు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వనస్థలిపురం సీఐ జలేంధర్ రెడ్డితో పాటు మరో ముగ్గురు సీఐలను రిలీవ్ చేసినట్లు తెలిసింది. వనస్థలిపురం సీఐగా గతేడాది మార్చి 31న బాధ్యతలు చేపట్టిన జలేంధర్ రెడ్డి తొమ్మిది నెలలకే బదిలీ కావడం విశేషం.

టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా మహేశ్



హయత్‌నగర్: హైదరాబాద్ జిల్లా టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా హయత్‌నగర్‌కు చెందిన పారంద మహేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు జనరల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న తన సేవలను గుర్తించి ఆ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర బీజేపీ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- రోజురోజుకూ పెరుగుతున్న వైనం
- కొనలేక జనం ఇబ్బందులు



వనస్థలిపురం రైతుబజారు

వనస్థలిపురం: రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలో కూరగాయల ధర రూ. 50 మొదలుకొని రూ.100 వరకు చేరుతుండటంతో కూరగాయలు కొనలేక గగ్గోలు పెడుతున్నారు. గతంలో రూ. 200 నుంచి 300 పెడితే వారం రోజులకు సరిపడా కూరగాయలు వచ్చేవని, నేడు రూ. 500 నుంచి 600 పెట్టినా వారానికి సరిపడా రావడం లేదని వారు వాపోతున్నారు. నాన్‌వెజ్‌లకు ధీటుగా కూరగాయల ధరలు పెరుగుతున్నాయని, ఇక కూరలు వండుకునేది.. తినేది ఎట్లా అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ప్రస్తుతం రైతుబజారుల్లో, బహిరంగ మార్కెట్లలో కొన్ని రకాల కూరగాయలు తప్ప మిగతా కూరగాయల ధరలు రూ.50కి చేరువలో, కొన్ని రూ. 50కి పైనే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గతంలో రూ. 20, 30 పెడితే కిలో కూరగాయలు వచ్చేవని, ఇపుడు రూ. 50 నుంచి 75 ధరల్లో కిలో లభ్యం అవుతున్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. ఇంతకుముందు కిలో కొన్నచోట ప్రస్తుతం అరకిలో, పావుకిలో కొని సరిపెట్టుకోవాల్సి వస్తోందని వారు అంటున్నారు.
- గురువారం రైతుబజార్లలో కిలో వంకాయ ధర రూ. 45, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ.45, కాకర రూ. 55, బీర రూ. 45, బీన్స్ రూ.45, కేరెట్ రూ.38, దొండ రూ.45, చిక్కుడు రూ.55, గోకర రూ.50, క్యాప్సికం రూ.70, దోస రూ.35, చామగడ్డ రూ. 55 ఉన్నాయి. ఆకుకూరలు సైతం గతంలో రూ. 10కి 5, 6 కట్టలు వచ్చేవి..ప్రస్తుతం ఒక్క కట్టకు రూ, 10 నుంచి 20 పెట్టాల్సి వస్తోంది. కాగా రైతుబజారుల్లోనే ఈ ధరలు ఉండగా, బహిరంగ మార్కెట్‌లో కిలోకు రూ. 20 నుంచి 30 అదనంగా ధరలు ఉన్నాయని, ఏ కూరగాయలైనా పావుకిలోకు రూ. 20 చొప్పున వసూలు చేస్తున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు. దీంతో కిలోల లెక్కన కూరగాయలు కొనలేక అరకిలో, పావుకిలోతో సరిపెట్టుకోవాల్సివస్తోందంటున్నారు.

రూ.600 పెట్టినా వారానికి సరిపడా రావడంలేదు

కూరగాయల ధరలు అధికంగా ఉన్నాయి. గతంలో రూ. 300 పెడితే వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. నేడు రూ. 600 పెట్టినా వారానికి సరిపడా రావడం లేదు. బహిరంగ మార్కెట్లో ఏ కూరగాయ కొన్నా పావుకిలో రూ.20 చెపుతున్నారు. అంటే కిలో కూరగాయలకు రూ.80 చొప్పున పెట్టాల్సివస్తోంది. దీంతో కిలో కూరగాయలు కొనేచోట పావు కిలో, అర కిలోతో సరిపెట్టుకోవాల్సివస్తోంది.

– విజయలక్ష్మి, గృహిణి, వనస్థలిపురం

దిగుబడి తగ్గింది



మామూలుగా చలికాలం కూరగాయల ధరలు తక్కువగా ఉంటాయి. అయితే భూగర్భ జలాలు తక్కువ కావడం, తేమ అధికంగా ఉండటంతో కొంతమేర పంటల సాగుబడి తగ్గింది. దీనికి తోడు కొన్ని రకాల కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి వస్తాయి. వివిధ కారణాల వల్ల బయటి నుంచి వచ్చే కూరగాయలు రావడం తగ్గింది. వనస్థలిపురం రైతుబజారుకు గతంలో రోజుకు 600 నుంచి 650 క్వింటాళ్ల వరకు కూరగాయలు వస్తుండగా, ప్రస్తుతం 400 క్వింటాళ్లు కూడా రావడం లేదు.

– ఈఓ. స్వప్న, రైతుబజారు, వనస్థలిపురం

నేటి నుంచి కశ్మీరీ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం



పోస్టర్ విడుదల చేస్తున్న ఎన్‌వైకే డైరెక్టర్ ఏఆర్ విజయారావు

సైదాబాద్: యువత పరస్పరం తమ అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకోవడానికి యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలు దోహదం చేస్తాయని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఏపీ, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల డైరెక్టర్ ఏఆర్ విజయారావు అన్నారు. గురువారం సైదాబాద్ డివిజన్ ఎస్‌బీహెచ్ కాలనీలోని ఎన్‌వైకే రాష్ట్ర కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర హోం, క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలు, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ సంయుక్త ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని కోపరేటివ్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం నుంచి కశ్మీరీ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం-2024 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో యువతకు స్వయం ఉపాధి పట్ల ఆసక్తి పెంచేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన యువజన సంఘాల సభ్యులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఎన్‌వైకే కార్యాలయ సిబ్బందితో కలిసి ఆమె ప్రోగ్రాం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కాలనీవాసులు

మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధి బాలాజీనగర్ కాలనీలో వివేరా ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉచిత వైద్య శిబిరాన్ని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోగుల మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు సాధారణ వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి ఐతగోని శ్రీనివాస్, కోశాధికారి శంకర్‌రెడ్డి, సహాయకార్యదర్శి పరుశరాంరెడ్డి, ఆసుపత్రి ప్రతినిధులు శ్రీకాంత్, డాక్టర్ ప్రవల్య, డాక్టర్ ప్రవల్లిక పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన

చంపాపేట: విద్యార్థిని విచక్షణారహితంగా దండించిన ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు గురువారం చంపాపేట డివిజన్ సాయిరాంనగర్ కాలనీలోని లోటస్ ల్యాబ్ ఉన్నత పాఠశాల ముందు ఆందోళన నిర్వహించారు. వివరాలు... సాయిరాంనగర్ నివాసి వెంకటరెడ్డి తన నాలుగేళ్ల కూతురు వినీతను లోటస్ ల్యాబ్ పాఠశాలలో ఎల్‌కేజీలో చేర్పించాడు. తరగతి గదిలో అల్లరి చేస్తుందనే నెపంతో పాఠశాల ప్రిన్సిపాల్ వినీతను విచక్షణారహితంగా దండించింది. చిన్నారి ద్వారా ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ బంధుమిత్రులుతో కలిసి పాఠశాలకు వచ్చి ఆందోళన నిర్వహించారు. ప్రిన్సిపాల్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో స్థానికంగా స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వారికి సర్ది చెప్పడంతో ఉద్రిక్తత సమసిపోయింది.

అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ



అంధ బాలికలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ అందరికీ ఆదర్శప్రాయుడని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా సైదాబాద్ డివిజన్‌లోని బీ బ్లాక్ క్వార్టర్స్‌లోని ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహంలో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ పాల్గొన్నారు. అంధ బాలికలతో కలిసి ఆమె లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలకు కార్పొరేటర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అంధ బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆస్రా, పద్మావతి, రాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ భువనేశ్వరి

మలక్‌పేట: రెగ్యులర్ అకాడమీతో పాటు జాతీయ స్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చాటడం అభినందనీయమని శ్రీచైతన్య స్కూల్ ఏజీఎం సతీష్ అన్నారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(ఐఎన్‌టీసీఓ) లేవల్-1లో ప్రతిభ చాటిన విద్యార్థులను మూసారంబాగ్ బ్రాంచిలో గురువారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధంగా విద్య అందించడం ద్వారా పిల్లల భవితకు పునాది పడుతుందన్నారు. పరీక్షల్లో సత్తా చాటిన 107 మంది విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ భువనేశ్వరి, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, కోఆర్డినేటర్ రఘువంశీ, డీన్ గిరి, ఒలింపియాడ్ ఇన్‌చార్జి సుమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి రూ.40 వేల విరాళం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి గోపిరెడ్డి మాధవ రెడ్డి మెమోరియల్ ట్రస్టు రూ. 40 వేలు విరాళంగా ఇచ్చింది. అమెరికాలో ఉంటున్న ట్రస్ట్ చైర్మన్ గోపిరెడ్డి సంజీవరెడ్డి కుటుంబ సభ్యులు గురువారం ఈ విరాళం మొత్తాన్ని అందజేశారు. భువనేశ్వర్ ఐఐటీలో చదువుతున్న అనాథ విద్యార్థి రాజా నాయక్, మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంఎంబీఎస్ చదువుతున్న అనాథ విద్యార్థి మహాకాళి చదువుకు ఈ డబ్బు వినియోగించాలని గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు మాధవ రెడ్డి మెమోరియల్ ట్రస్టు సభ్యుడు తుమ్మలపల్లి రాజేష్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో శేఖర్ రెడ్డి, రాజేష్ రెడ్డి,ఆండాళ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఎల్బీనగర్‌ను రోల్‌మోడల్ చేస్తాం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సాగర్‌రింగురోడ్డులో స్కైఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించి ఎల్బీనగర్‌ను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురం సాగర్‌రింగ్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న స్కైఫ్లైఓవర్ పనులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్బీనగర్ చౌరస్తాను సిగ్నల్ ఫ్రీ చౌరస్తాగా మార్చామని, ఎస్ఆర్‌డీపీ పనుల్లో భాగంగా దాదాపు 658 కోట్ల రూపాయల వ్యయంతో పనులు చేపట్టామని చెప్పారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని అన్ని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ పనులు పూర్తయ్యాయని, ఎల్బీనగర్ జంక్షన్ వద్ద కుడి, ఎడమ ఫ్లైఓవర్లు అండర్ పాస్‌లు నాగోలు జంక్షన్ ఫ్లైఓవర్ కామినేని జంక్షన్ వద్ద రెండువైపులా ఫ్లైఓవర్లు చింతల కుంట జంక్షన్‌వద్ద అండర్‌పాస్, బైరామల్‌గూడ అలేఖ్య టవర్స్ జంక్షన్ వద్ద రెండు ఫ్లైఓవర్లు నిర్మించామని, ప్రస్తుతం అలేఖ్య టవర్స్ వద్ద సెకండ్ లెవల్ నూతన స్కైఫ్లైఓవర్ పనులు తుది దశకు చేరాయని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వెల్లడించారు. సంక్రాంతి పండుగ వరకు పనులు పూర్తి స్థాయిలో జరుగుతాయని, ఈ స్కై ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉండవన్నారు. కరోనా సమయంలో ఎన్నో కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం వల్లే రోడ్డు వెడల్పు పనులు, ఫ్లైఓవర్ పనులు వేగవంతంగా పూర్తి చేశామని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, గజ్జెల మధుసూదన్ రెడ్డి, జక్కిడి మల్లారెడ్డి, మధుసాగర్, మహేశ్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పాలకమండలి సమావేశం ఏర్పాటు చేయండి

- కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్‌రోస్‌లను గురువారం సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కలిశారు. నగరంలో పేరుకుపోయిన సమస్యలను చర్చించేందుకు ప్రతి మూడు నెలలకోసారి పాలకమండలి సమావేశం ఏర్పాటు చేయాలని, ఆస్తిపన్ను ఎగవేస్తున్న బడా వ్యాపారవేత్తలు, సినిమాహాళ్లు, షాపింగ్‌మాళ్లు, హోటళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అక్రమ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లో ఫైర్‌సేఫ్టీ నిబంధనలను పరిశీలించాలని కోరారు. అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని, కల్తీ ఆహారంపై నివారణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు శ్రీవాణి తెలిపారు.

మహిళలకు ఉపాధి అవకాశాలపై ఉచిత శిక్షణ



శిక్షణ పొందుతున్న మహిళలతో ఫౌండేషన్ చైర్‌పర్సన్ కావ్య కిషన్‌రెడ్డి

కాచిగూడ: మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని అటల్ బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ చైర్ పర్సన్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి భార్య జి.కావ్య కిషన్‌రెడ్డి తెలిపారు. వాజ్‌పేయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బర్కత్‌పురా, అంబర్‌పేటలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. సెంటర్ కో ఆర్డినేటర్ నీరజ, అనురాధ, సద్గుణ, వనజ, రేణుక, ఉషా మయూరి, సునిత తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు కాంగ్రెస్ నేతల సన్మానం



మంత్రి సీతక్కను సన్మానించిన ముత్తినేని వీరయ్య



మంత్రి సీతక్కను సన్మానించిన కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు మలక్‌పేటకు వచ్చిన రాష్ట్ర మంత్రి సీతక్కను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి శాలువాతో సత్కరించారు. అదేవిధంగా దివ్యాంగుల నాయకుడు గొల్ల పాండు మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సతీశ్‌గౌడ్ దేశగాని, సురేష్, చౌకి రవికుమార్, బాబు శ్రీనివాస్, కృపాకర్‌రెడ్డి, రామచంద్రయ్య, భాస్కర్, సాయిబాబా చారి, కందిగంటి వెంకన్న పాల్గొన్నారు.

మహేశ్వరం ప్రజలకు రుణపడి ఉంటా

ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన మహేశ్వరం నియోజకవర్గం ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని షాహీన్‌నగర్‌లో గురువారం ఆమె 77 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాటు విజయవంతంగా ఈ పథకాన్ని అమలు చేశారన్నారు. తనపై పూర్తి విశ్వాసం ఉంచి గెలిపించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇకపై మరింత బాధ్యతాయుతంగా పని చేస్తానన్నారు. చెక్కులు గతంలోనే మంజూరయ్యినప్పటికీ.. ఎన్నికల కోడ్ కారణంగా అందించలేకపోయామని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా కల్యాణలక్ష్మి పథకానికి తులం బంగారాన్ని కలిపి ఇవ్వాలన్నారు. ఈ ఒక్కరోజే బాలాపూర్ మండల పరిధిలో 179 మంది లబ్ధిదారులకు రూ.1.79 కోట్ల చెక్కులు అందించానని తెలిపారు. కార్యక్రమంలో జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది, బాలాపూర్ తహసీల్దార్ మాధవి రెడ్డి, జల్‌పల్లి కమిషనర్ ఎస్.వసంత, నాయకులు యూసుఫ్ పటేల్, షేక్ అఫ్జల్, లక్ష్మీనారాయణ, శంషొద్దీన్, యాహ్యా, ఉమర్ బామ్ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సార్లూ.. ఈ స్తంభాలను తొలగించరూ!

- రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు
- రాకపోకలకు కాలనీవాసుల అవస్థలు

ఎల్బీనగర్: రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల కాలనీ రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోందని సచివాలయనగర్ కాలనీవాసులు వాపోతున్నారు. అసలే ఇరుకు రోడ్డు... ఆపై రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల కారణంగా అవస్థలు పడుతున్నామని, దానిని తొలగించాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని పలువురు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో స్తంభాలు ఉండటం వలన అక్కడ చెత్త పేరుకుపోతోందని తెలిపారు. గతంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాన్ని తొలగించాలని అధికారులను ఆదేశించారని, అయినా తొలగించలేదని పలువురు కాలనీవాసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాలను తొలగించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సచివాలయనగర్‌లో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

భజనలు.. మేళతాళాలతో ఇంటింటికీ 'అక్షింతలు'



శ్రీరాముని అక్షింతల పంపిణీలో పాల్గొన్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

చైతన్యపురి: అయోధ్య శ్రీరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమం గురువారం గడ్డిఅన్నారం డివిజన్‌లోని పలు కాలనీల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్రం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం మమతానగర్, లలితానగర్ కాలనీల్లో కొనసాగింది. రామభజనలు, సన్నాయి మేళాలతో ఇంటింటికీ వెళ్లి అక్షింతలు, రామమందిర చిత్రపటాన్ని పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ పూర నర్సింహగుప్తా, కాలనీవాసులు సత్యనారాయణ, గండి సన్నియాదవ్, అనంతాచారి, కళ్లెం మధుసూదన్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

నాగోలులో..

నాగోలు జైపురి కాలనీలోని శివాలయం నుంచి రాముల వారి అక్షింతలను ఊరేగింపుగా భాగ్య ఎన్‌క్లేవ్ అపార్టుకు తీసుకొచ్చి 90 ఫ్లాట్‌లలో పంచిపెట్టారు.

గడ్డిఅన్నారంలో...

గడ్డిఅన్నారంలో కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. కీర్తిగౌరి అనంతాచారి, జ్యోతి ప్రసాద్ యాదవ్, బాబుగౌడ్, ఐలేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌సదన్‌లో..

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి గురువారం బృందావన్ కాలనీలో అయోధ్య శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు. బీజేపీ నేతలు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు.. నాగేశ్వరరావు, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, అజయ్ రెడ్డి, ప్రసాద్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో...

డివిజన్ పరిధిలో మధురానగర్, కాస్మోపాలిటన్ కాలనీ, వీకర్‌సెక్షన్ కాలనీ, చండీశ్వరి కాలనీలలో గురువారం శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, ఆయా కాలనీలవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుర్మగూడలో...

చంచల్‌గూడ: కుర్మగూడ బస్తీలో గురువారం ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి అయోధ్య శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, కమిటీ సభ్యులు బండ వెంకట్‌రెడ్డి, దేవరాజు, కిషోర్‌యాదవ్, నాగరాజు, లలిత, కల్యాణ్, వెంకట్ పాల్గొన్నారు.



బృందావన్ కాలనీలో అక్షింతలు అందజేస్తున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి



శ్రీరాముల వారి అక్షింతల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి



జైపురి కాలనీలోని భాగ్య ఎన్‌క్లేవ్ అపార్టుమెంట్‌లో..

కాంగ్రెస్ పాలనలోనే ప్రజా సంక్షేమం

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజా సంక్షేమం, ప్రగతి, అభివృద్ధి, కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఫరీద్ అన్నారు. గురువారం కృష్ణానగర్ బస్తీలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రంలో ప్రజలకు ఆరు గ్యారంటీల దరఖాస్తు అభయ హస్తం దరఖాస్తులను ఆయన పంపిణీ చేశారు. ప్రజా పాలన ద్వారా వంద రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించి కాంగ్రెస్ పాలన చూపిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకోవాలని సూచించారు. నేతలు ఉపేందర్, ఎ.నర్సింగ్ రావు, ఎ.కిషోర్, ఎ.బాలకృష్ణ, ఎం.సత్యనారాయణ, ఉమేష్ బాబు, జి.వికాస్, ఎ.కిషోర్, వీరస్వామి, ఆరీఫ్, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



బ్రహ్మకుమారీస్ కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

కాచిగూడ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకుంటే మానసిక ప్రశాంతత చేకూరుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం బర్కత్‌పురాలోని బ్రహ్మకుమారీస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కాలేరు పద్మ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భక్తిభావంతో పుణ్య ఫలం లభిస్తుందని, ఎన్ని పనులున్నా భగవంతుని సన్నిధిలో కాసేపు గడపడానికి సమయాన్ని కేటాయించాలని సూచించారు. మనిషి ఆనందంగా ఉండటానికి జ్ఞానం అవసరమని, అది ఉంటేనే ఎల్లవేళలా సంతోషంగా ఉంటారన్నారు. జ్ఞానాన్ని సముపార్జించుకోవడంతో పాటు బాంధవ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సృష్టిలో మానవ జన్మ చాలా గొప్పదని, అందుకు ప్రతిక్షణం సత్యాన్వేషణ కోసం తపించాలన్నారు. జనహిత కార్యాలు చేయడంతో పాటు భగవంతుని నామస్మరణ చేయాలని హితబోధ చేశారు. బ్రహ్మకుమారీ కేంద్రం ప్రజలకు అందిస్తున్న సేవలు చాలా బాగున్నాయని ప్రశంసించారు.